# 'ఓంకార నిజదర్శనం'

**అద్భుతమైనది... పరమ పవిత్రమైనది 'ఓంకారం'**

**ఓంకారం - సర్వమతాలకు సర్వజనులకు చెందిన అతి పవిత్రమైన మాట.**
**ఓంకారం గురించి ప్రపంచానికి అమృతమైన వాక్కులతో చాటిచెప్పిన మహనీయుడు రామతీర్థ స్వామి..**

ఓంకారం అనే బీజం నుంచే వేదం అనే మహావృక్షం పెరిగింది. గులాబీలోని వాసనలా దీపంలోని వెలుగులా, ఓంకారం సహజమైనది. అంతే సహజంగా, దానినుంచి వేదాలు ఉద్భవించాయి. రెండూ అవిచ్ఛిన్నాలు, అభిన్నాలు. ఏకమే. ఓంకార జపం వల్లనే రుషులు బ్రహ్మదర్శనం చేయగలి గారు. అంహంకారం వదిలించుకున్నారు. సంకుచిత పరిధిదాటి, విశ్వదర్శనం చేశారు. చీకటినుంచి వెలుగుకు, అజ్ఞానం నుంచి విజ్ఞానానికి ప్రస్థానం చేశారు.



ఓకారం జపించడం అంటే, నాలుకతో అనటం మాత్రమేకాదు. పెదవులు, కంఠం, శరీరం, స్మరిస్తున్నప్పుడు మనస్సు కలిసి పలకాలి. హృదయం అప్పుడు ఉన్నత భావపారవశ్యం చెందుతుంది. ఇలా మనసు, దేహం, హృదయం కలిపి ఓంకారం జపించాలి. దీన్నే త్రికరణశుద్ధిగా జపించటం అంటారు. దీనివల్ల సకల ఐశ్వర్యాలు లభిస్తాయి. దివ్యజ్యోతి దర్శనమిస్తుంది. సర్వాంతర్యామి అయిన భగవంతుని నిజనామమే ఓంకారం. 'ఓం ఇతి ఏకాక్షరం బ్రహ్మ' అంటుంది కదా స్మృతి.

ఓంకారం హిందువులకు మాత్రమే చెందిందని, సంస్కృత శబ్దం అని అందరు అనుకుంటారు. సంస్కృతభాషలో ఓంకారం, శబ్దశాస్త్రానికి అతీతంగా కనిపిస్తుంది. ఇతర సంస్కృత శబ్దాలను బంధించినట్లు, వ్యాకరణం దీన్ని బంధించదు. అంటే విముక్తమైనదని అర్థం. అంటే స్వతస్సిద్ధంగావచ్చిన ప్రకృతివాక్కు. దాన్ని రుషులు దర్శించి, స్వీకరించారు. పసిబిడ్డ పుట్టగానే 'అం' అంటాడు. 'ఉం' అంటాడు, 'మ' అంటాడు. ఈ మూడు కలిస్తే 'ఓం' అవుతుందికదా! ఓంకారంలో, ఈ మూడు ధ్వనులు వున్నాయని అందరూ చెప్పినవిషయమే. పసిబిడ్డ భగవంతుని స్వరూపం అంటాం కదా! ఆ పలుకులకు మురిసిపోతాం. అంత స్వచ్ఛమైన భాష శివుడి అదే బ్రహ్మవాక్కు - బాలవాక్కు అంటే. పసిబిడ్డ ఏ మతానికి చెందినవాడుకాదు. జబ్బుపడితే, బాధల ఖ'ఉమ్, ఉమ్' అని మూలుగవస్తుంది. ఇలా మూలిగి రోగి ఉపశాంతి పొందుతాడు. వాడిపాలిటి ఉపశమనం ఓం కారం అవుతోందా? లేదా? పసిపిల్లలు ఆనందపారవశ్యంలో, తమకు తెలియకుండానే ఓంకారం పలుకుతారు. కనుక ఆనందస్వరూపమూ ఓంకారమే. మనలోని అహంకారం మాయమైనపుడు, సహజసిద్ధంగా ఓంకారం, మనలోనుంచే వినిపిస్తుంది. ప్రపంచ భాషల్లో ఓంకారం మొదటి స్థానం పొందింది. ఆంగ్లంలో, సర్వజ్ఞత్వం అంటే... "Omniseent" అంటారు. ఇది ఓంకారంతో ప్రారంభమైన మాటే సర్వవ్యాపికత్వాన్ని "Omnipotent" అంటారు. ఇదీ అంతేకదా...! సర్వశక్తిమత్వంను "Omnipotent" అంటారు. ఈ మాటకూడా ఓంకారంతోనే ప్రారంభమైంది. ఈ మూడు మాటలూ, భగవంతుని సహజగుణాలు. మూడు ఓంతో ప్రారంభమవటం చిత్రంగా వుందికదా! ఇవి అనునాశిక ధ్వనితో కూడిన పదాలు. పరమేశ్వరుని కీర్తించే, మహాద్భుత, మహోన్నత పదాలు అవి.

క్రైస్తవులు, ప్రార్థనలో, అతీత స్థితికి వచ్చినపుడు 'ఆమెన్' అంటారు. పర్షియన్, అరబిక్, హిందీ భాషల్లో, ఇంగ్లీషులో 'ఏమెన్' అంటారు. కనుక, నాగరికత వున్న ప్రధానభాషలన్నిటిలో, వాక్కుకు అందని, దివ్యమైన శాంతి స్థితిలోకి పోయినపుడు, అంతరాంతరాల్లో, ఈ దివ్యమైన శబ్దం నృత్యం చేస్తుంది. ఆనందపు డోలికలనూపుతుంది. ఇది మాటలకు అందని పరమానంద స్థితి. ఆ తన్మయస్థితిలో, హిందువులు "యతోవాచో నివర్తంతే - అప్రాప్యమనసా సహ" అన్నారు. అంటే ఒక పరమోత్కృష్ట స్థితికి వెళుతున్నప్పుడు, గోడకు బంతి తగిలి వెనక్కి వచ్చినట్లుగా, వాక్కు కూడా వెళ్లి ఇక వెళ్లలేక తిరిగి వస్తుంది. ఈ స్థితిలో 'ఏమెన్' శబ్దం వాళ్ళకూ, ప్రపంచానికి అభేదం కల్పిస్తుంది. ఈ శబ్దం కూడా ఓంకారం యొక్క ఛాయయే. కనుక ఓంకారమే, పరమ పావనుడైన భగవంతుని సహజనామంగా, అందరు భావించినట్లు తెలుస్తోంది.

మనం ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు చేస్తున్నప్పుడు 'సోలాహం' సోలాహం' అని వినిపిస్తుంది. ఒంటరిగా గాలిపీలిస్తే 'సోలాహం' వినిపిస్తుంధి. సంస్కృతంలో ఈ మాటకు 'నువ్వేనేను' అని అర్థం కదా! ఇంగ్లీష్ మొదలైన భాషల్లో 'ఏం అంటే 'అది' అంటే ఆ పరమాత్మ, ఆ పరబ్రహ్మ, 'హం' అంటేనేనే. మొత్తం మీద 'అది నేనే' అని భావం. గాలి పీల్చటంలో వచ్చే 'సోహం' ధ్వనిలో రెండు హల్లులున్నాయి. మిగతావి రెండూ, రెండు స్వతంత్రశబ్దాలు. మొదటి హల్లు 'ఎస్' - సకారం. రెండోది 'హెచ్' హకారం. వీటిని తీసేస్తే మిగిలేది 'ఓం' అనే జీవశబ్దం. మానవుని ఉచ్ఛ్వాసనిశ్వాసాలు, ప్రాణం, ప్రపంచం అన్నీ 'ఓం' అనే స్వతంత్ర ధ్వని మీదే ఆధారపడివున్నాయని మనకు తెలిసిందికదా! కనుక 'ఓం' భాషాతీతశబ్దం. సమస్త చరచర జగత్తు, మొత్తం చైతన్యం ఓంకారమే. ఓంకారస్మరణంవల్ల, ఆత్మతన్మయస్థితిని పొందుతుంది.

ధ్వనులు రెండురకాలు. వ్యక్తధ్వని, అవ్యక్తధ్వని. వ్యక్తధ్వనికి అక్షరాలు అవసరం. అక్షరాలు లేనిది అవ్యక్తధ్వని. అక్షరధ్వని మేథస్సుకు సంబంధించింది. అవ్యక్తధ్వని హృదయానికి సంబంధించిందని, మనస్తత్వ శాస్త్రజ్ఞులు విశ్లేషించి, తెలిపారు. వ్యక్తధ్వనికి అర్థం వుంటుంది. ఆ భాష మాట్లాడేవారికి మాత్రమే అర్థం అవుతుంది. మనం నవ్వాం అనుకోండి. దాని అర్థం అందరికి తెలుస్తుంది. అది అక్షరభాషకాదు. అవ్యక్తధ్వని. అది ప్రేమభాషకనుక అందరికి తెలుస్తుంది. ఆనందంలో చప్పట్లు చరిస్తే అందరికి అర్థమవుతుంది. ఇక్కడ అక్షరాలతో పనిలేదు. అంటే వ్యక్తధ్వనికంటే, అవ్యక్తధ్వని చాలా శక్తివంతమైనది. సద్యోఫలితాన్నిస్తుంది. అవ్యక్త ధ్వని సకలలోకాలకు చెందింది, మధురమైనది, హృదయానికి చెందింది. హృదయమే నేడు లోకాన్ని పరిపాలిస్తున్నదని తత్వవేత్తలు అభిప్రాయపడ్డారు. అందుకే "Heard Melodies are Sweet - but Those unheard are sweeter" అన్నారు. మాటలకంటే సంగీతం ఎక్కువ ప్రభావితం చేస్తుంది. దాన టఫలితమూ గొప్పదే. సంగీతం భాషకు అందనిది. లొంగనిది, మధురమైనది. ఒక్కొక్క ధ్వనికి ఒక్కొక్క ప్రభావం వుంటుంది. అలాగే ఓంకారం అవ్యక్తమధురమైనధ్వని. దీనివల్ల అందరితోనూ ఆత్మానుసంధానం కలుగుతుంది. అది అనుభవించి, ఆనందించాల్సిందే. ఓంకారానుసంధానం వల్లే భారతీయదార్శనికులు ఆత్మజ్యోతిని దర్శించారు. ఓంకారం సర్వమతాలకు, సర్వజనులకు చెందిన అతి పవిత్రమైన మాట, మంత్రం. దీన్ని అర్థం చేసుకొని జపించి, అనుభవించి, తరించటమే మనందరి కర్తవ్యం. ఇంతటి జ్ఞానధారను మనపై వర్షించి, ఓంకార నిజతత్వాన్ని, తన అమృత మయమైన వాక్కులద్వారా, ప్రపంచానికంతటికి చాటిచెప్పిన మహానుభావుడు స్వామి రామతీర్థ. నిజంగా ఆయన చెప్పిందంతా తీర్థం అంత పవిత్రమైనది, పుణ్యమైనది. 'ఓం సత్యత్'....!

– గబ్బిట దుర్గాప్రసాద్, ఎం.ఏ., బి.ఎస్.సి., బి.ఇడి.,
హెడ్‌మాస్టర్ (రిటైర్డ్)